# ఇంపోర్టెడ్ షర్ట్

శ్రీనివాసరావు తీవ్రంగా చూశాడు చిదంబరాన్ని....

చిదంబరం తడబడ్డాడు. తనేం తప్పుచేశాడు? డ్రాఫ్టింగ్‌లో ఏదైనా పొరపాటుందా?- ఉండటానికి వీల్లేదే-- తను చాలా జాగ్రత్తగా చేశాడంతా.... మరి ఏమైంది?

పిలిపించి, కనీసం కూర్చోమనకుండా ఏమిటిది? అయోమయంగా నిల్చునే ఉన్నాడు చిదంబరం. ఎంతసేపటికీ ఆఫీసరు శ్రీనివాసరావు మాట్లాడకపోయేసరికి "సార్ మీరు నన్ను...." అంటూ నీళ్లు నమిలాడు.

"ఆఁ.... ఎస్.ఎస్. కూర్చో...." అన్నాడు అతని నుంచి దృష్టి తప్పిస్తూ.

ఓ దీర్ఘనిశ్వాసం వదిలి కూర్చున్నాడు చిదంబరం.

అప్పటికీ మాట్లాడలేదు శ్రీనివాసరావు- చాలా ఇబ్బందిగా ఉంది చిదంబరానికి.

"ఆ షర్టుపీస్ ఎక్కడ కొన్నావ్?" అన్నాడు చివరికి. ఉలిక్కిపడ్డాడు చిదంబరం- ఆఫీసరుగారు తన్ను ఏమడిగారు- ఫైలు గురించా షర్టు గురించా?

"ఊఁ" అన్నాడు- తలదించి తను వేసుకున్న చొక్కావైపు చూసుకుంటూ.

"అదే- నీ షర్టు ఎక్కడ తీసుకున్నావయ్యా" ఈసారి విసుగ్గా అడిగాడు శ్రీనివాసరావు....

"ఇదాసార్ - ఇన్‌స్టాల్ మెంట్ల మీద - మన అటెండర్ రామయ్య ప్రతినెలా తీసుకువస్తుంటాడు- ఇది ఇక్కడిది కాదు - అతను ఇంపోర్టెడ్ మాత్రమే తెస్తాడు.... కాస్త ఉత్సాహంగా చెప్పాడు తన షర్టు ఆఫీసరు గారికి నచ్చిందన్న ఉత్సాహంతో.

శ్రీనివాసరావు తాను ధరించిన షర్టువంక చూసుకున్నాడు- మూడేళ్ళ నుంచి తొడుగుతున్నాడేమో పాత పడి వెలవెల పోతోంది. మరి ఎదురుగా కూర్చున్న గుమస్తా చిదంబరం షర్టు తళతళా మెరుస్తోంది.

చాలా అవమానమనిపించింది శ్రీనివాసరావుకి "సరే-నువ్వెళ్ళి పని చూసుకో"- అన్నాడు-చిదంబరం వెళ్ళిపోయాడు.

* * *

ఇంకో రోజు భార్య సరోజ తన పుట్టిన రోజుకి ప్రేమగా కుట్టించిన షర్టు చాలా ఆనందంగా ధరించి వచ్చాడు ఆఫీసుకు.

ఆఫీసులోకి అడుగు పెట్టగానే ఆయన మూడ్ ఆఫ్ అయిపోయింది. తనకు నమస్కారం చేస్తున్న అటెండర్ వేసుకున్న చొక్కా,

తన చొక్కా ఒక్క తానుగుడ్డలు తల గిర్రున తిరిగి నట్లైంది శ్రీనివాసరావుకు.

ఎంత అవమానం - అసలు తను వేసుకున్న లాంటి చొక్కా తన కంటే దిగువ తరగతి అటెండర్ వేసుకోవడమూ! అట్లా వీల్లేదు- కారణం లేకుండానే ఆ రోజు చాలాసార్లు ఆఫీసరు గారిచేత చీవాట్లు తిన్నాడు, అటెండర్ అనంతం.

సాయంత్రం అవుతుంటే, ఆదేపనిగా కసిగా బెల్ మోగించాడు శ్రీనివాసరావు. ఎదురుగా వచ్చిన అనంతాన్ని చూస్తే పిచ్చి కోపం వస్తోంది- ఒళ్లు మండుతోంది- అనంతం అటు తిరిగి నవ్వుతున్నాడేమో అనే అనుమానం ఓ పక్క. మొహం చిట్లించి, "ఏం చేస్తున్నావ్! నిద్ర పోతున్నావా ఆఫీసులో కూర్చుని, పిలవగానే రావాలని తెలీదూ"- అని ఒక్క కసురు కసిరి, "రామయ్యను పిలువ్"- అన్నాడు

మరొక నిమిషంలో రామయ్య ఉన్నాడక్కడ. "నువ్వు ఇన్‌స్టాల్ మెంట్లలో ఇంపోర్టెడ్ బట్టలు అమ్ముతావట....

"అవున్సార్"- అన్నాడు అతను.

"ఇప్పుడున్నయ్యా నీ దగ్గర?"

"లేవుసార్! తమరికి కావాలంటే రేపు తెచ్చిస్తాను...."

"ఆఁ కావాలి.... రేపు వస్తూ తీసుకురా మంచివి" అని ఆర్డర్ వేశాడు, మంచిని వత్తి పలుకుతూ.

మర్నాడు వస్తూనే మంచి మంచి ఇంపోర్టెడ్ షర్టుపీసెస్ తీసుకుని శ్రీనివాసరావుగారి ముందుంచాడు రామయ్య.

అందులోంచి తనకు నచ్చిన పీసెస్ రెండు తీసుకున్నాడు శ్రీనివాసరావు. ఖరీదుతో పాటూ బట్టలూ చాలా బాగున్నై. అవి తీసుకుంటూ రామయ్యతో అన్నాడు శ్రీనివాసరావు, "చూడు రామయ్యా! ఇటువంటివి ఈ ఆఫీసులో ఇంకెవ్వరికీ అమ్మడానికి వీల్లేదు- అదే.... ఈ డిజైను- తెలిసిందా?" అర్థమైందో, కాలేదో గానీ తలూపాడు రామయ్య.

శ్రీనివాసరావు అవస్థ గమనించి ఆఫీసులో అందరూ నవ్వుకుంటున్నారన్న వార్త పాపం ఆయనకి తెలియదు. మొట్టమొదట చిదంబరాన్ని షర్టు గురించి అడిగిన నాటి నుంచే అందరికీ అర్థమైపోయిందాయన బాధ. ఇక రామయ్య దగ్గర బట్టలు కొనడం- అట్లాంటిది ఆఫీసులో ఎవరికీ అమ్మవద్దనడం అందరికీ ఇదో నవ్వుకునే టాపిక్ అయిపోయింది.

ఓ మూడు నాలుగు రోజుల్లో శ్రీనివాసరావు కొత్తచొక్కావేసుకుని సెంటు స్ప్రే చేసుకుని దర్జాగా వచ్చాడు ఆఫీసుకు....

-అందరూ ముసిముసిగా నవ్వుకున్నారు. కొద్దిగా ఆయన దగ్గర చనువున్న వాళ్ళు "షర్టు చాలా బాగుందిసార్-" అన్నారు కూడా ఉప్పొంగి పోయినాడు శ్రీనివాసరావు.

"నీకు ప్రమోషనిస్తాడేమో"- అని ఆ మాట అన్న సాగర్ని ఆట పట్టించారు అంతా కలిసి.

ఆ రోజు సాయంత్రం వరకు శ్రీనివాసరావు చాలా మంచిమూడ్‌లో ఉన్నాడు. ఉత్సాహంగా తిరిగాడు ఆఫీసంతా. భార్యను ఫస్ట్‌షోకి సినిమాకు తీసుకు వెళ్తానని మాటిచ్చాడు. 5 గం॥లు కాగానే చొక్కా కాలరు సర్దుకుంటూ బయటికి వచ్చాడు.

రోడ్డుమీదికి రావడానికి గేటు దగ్గరకి రాగానే గేటు పక్కనే రిక్షా నిలుపుకుని ఉన్న రిక్షావాణ్ని చూసి షాకైనాడు శ్రీనివాసరావు.

చాటు మాటుననక్కి పక్కన నవ్వుకుంటున్న చిదంబరం, అనంతం, రామయ్యల సంగతి శ్రీనివాసరావుకి తెలియదు-

తాను వేసుకున్న చొక్కా లాంటిదే ఇంపోర్టెడ్ చొక్కా వేసుకున్న రిక్షావాలా "సార్ రిక్షాకావాలా" అంటుంటే, రిపేర్‌లో ఉన్నకాషు గుర్తొచ్చి కోపంగా హుంకరించి పక్కనే పోతున్న ఆటో ఆపి ఎక్కి కూర్చున్నాడు శ్రీనివాసరావు.

(వంశీప్రియ సెప్టెంబరు 1986)